
శ్రీ లలితారహస్యోపనిషత్తు

డా॥ క్రోవి పార్థసారథి



శివకామేశ్వరి గ్రంథమాల

విజయవాడ-13.

శ్రీ లలితారహస్యోపనిషత్తు



మైసూర్ దత్తపీఠ ఆస్థాన విద్వాంసులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ తారణనామ సంవత్సర ఉగాది పురస్కార గ్రహీత,

ఉత్తమ ఉపాధ్యాయ, కనకాభిషేక గ్రహీత, గండపెండేర సన్మానిత,

సువర్ణఘంటాకంకణ, చక్రవిద, శ్రీవిద్యానిధి, శ్రీవిద్యారత్నాకర, శ్రీవిద్యా విశారద

డా॥ క్రోవి పార్థసారథి

(పరమానందనాథ)

లలితారహస్యోపనిషత్తు

గ్రంథకర్త :
డా॥ క్రోవి పార్థసారథి (పరమానందనాథ)
లీడర్ ఇన్ కామర్స్
శాతవాహన కళాశాల, విజయవాడ.

ప్రథమ ముద్రణ : జులై, 2005

ప్రతులు : 1000

వెల : రూ. 12-00 **వెల : రూ. 15-00**

ప్రాప్తి స్థానములు :
కె. మంజూష
23-11/1-10/2, దేవీ నిలయం
ఓగిరాలవారి వీధి, సత్యనారాయణపురం,
విజయవాడ - 520 011.
ఫోన్ : 0866-2530672
సెల్ : 98497 85031

శివకామేశ్వరి గ్రంథమాల
41-22/4-36, భ్రమరాంబాపురం,
కృష్ణలంక, విజయవాడ - 13.
ఫోన్ : 0866-2522824

ముద్రణ :
నిర్మలా ఆఫ్‌సెట్ ప్రింటర్స్
26-6-3, పాపయ్య వీధి, గాంధీనగర్,
విజయవాడ-3. ఫోన్ : 0866 - 2574828

శ్రీ లలితారహస్యోపనిషత్తు

మైసూర్ దత్తపీఠ ఆస్థాన విద్వాంసులు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ తారణనామ సంవత్సర ఉగాది పురస్కార గ్రహీత,
ఉత్తమ ఉపాధ్యాయ, కనకాభిషేక గ్రహీత, గండపెండేర సన్మానిత,
సువర్ణఘంటాకంకణ, చక్రవిద, శ్రీవిద్యానిధి, శ్రీవిద్యారత్నాకర, శ్రీవిద్యా విశారద

డా॥ క్రోవి పార్థసారథి

(పరమానందనాథ)

శివకామేశ్వరి గ్రంథమాల

41-22/4-36, భ్రమరాంబాపురం, కృష్ణలంక,
విజయవాడ - 520 013. ఫోన్ : 0866-2522824

లలితా రహస్యోపనిషత్తు అను ఈ గ్రంథము
శ్రీవిద్యా పూర్ణాదీక్షాపరులు, ధర్మపురుష
శ్రీ యాబలూరి లోకనాథశర్మ, శ్రీమతి విమలాకామేశ్వరి
గార్లకు
అంకితం యివ్వబడినది.

श्री अवधूत दत्त पीठम्

श्री गणपति सच्चिदानन्द आश्रमः
दत्त नगरम्, नीलगिरि मार्ग, मैसूरु ५७००२५

जयतु गुरु दत्तः
स्वस्तिश्री चान्द्रमान पार्थिव नाम संवत्सरे वैशाखमासे
कृष्णपक्षे षष्ठ्यां तिथौ भानुवासरे
(२९-५-२००५ दिनाङ्के)
श्रीविद्या क्षेत्रे
कृत निरुपमान परिश्रमाः

श्रीमन्तः डा. क्रोवि पार्थसारथि महोदयाः

तद्विरचिताभिः सेवाभिः परितुष्टैः
श्रीमदवधूत दत्तपीठाधीशैः जगद्गुरुभिः परमपूज्यैः
श्री श्री श्री गणपति सच्चिदानन्द स्वामीजी पूज्यपादैः


दत्तपीठ आस्थान विद्वान्

इति उपाधि प्रदानेन सम्मानितास्सत्कृता अनुगृहीताश्च।

कुमार वेंकट कृष्णमूर्तिः
विद्याधिकारी

पीठमुद्रा

प्रसाद शर्मा
कार्य निर्वाहकः



డా|| క్రోవి పార్థసారథిగారిని మైసూర్ దత్తపీఠ ఆస్థాన విద్వాంసులుగా నియమిస్తున్న పూజ్యశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ,
గుజరాత్ రాష్ట్ర గవర్నర్ గౌ|| శ్రీ నావల్ కిషోర్ శర్మ, కర్ణాటక రాష్ట్ర గవర్నర్ గౌ|| శ్రీ టి.ఎన్. చతుర్వేది, 29-5-2005

పరమహంస, పరివ్రాజకాచార్య, జగద్గురు

శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి

సిద్ధేశ్వరీ పీఠాధిపతి - కుర్తాళం.

MOUNASWAMY MUTT,
Courtallam - 627 802
(Via Tenkasi),
Thirunelveli Dist.
TAMILANADU.
Ph : 04633-283707

CAMP OFFICE :
B1-C40, Kaalipeetam St.,
4th Line, Ravindra Nagar,
Guntur - 522 006. (A.P.)
Ph : 0863 - 2231625
2256666

ఆశీర్వాద శ్రీముఖము

డాక్టర్ క్రోవి పార్థసారథిగారు ఆధ్యాత్మిక గ్రంథరచనలో నిష్ణాతులైన వారు. ముఖ్యముగా శ్రీవిద్యను గూర్చి, లలితాదేవిని గూర్చి ఎన్నో గ్రంథాలు రచించారు. ఎంతో కృషి, సాధన చేసిన భావుకులు. తమకు కలలో అనుభూతమైన ఈ **లలితా రహస్యోపనిషత్తు**నకు పుస్తకాకృతి కల్పించి సహృదయులకు అందిస్తున్నారు. పరమేశ్వరిని గురించిన తాత్వికచింతన ఈ గ్రంథములో భవ్యంగా భాసిస్తున్నది. చాలా విశేషాలు చక్కగా ఆవిష్కృతమైనవి.

కొన్ని సంవత్సరాల క్రిందట బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రి గారు "మత్స్వప్నః" అనే గ్రంథాన్ని అందించారు. బ్రహ్మాండ పురాణాంతర్గతమైన లలితాదేవికథ - రెండుచోట్ల కొద్ది తేడాలతో ఉంటే వాటి సమన్వయానికి అందులో ఒక రూపకల్పన చేశారు. వారు బాలను ఉపాసించిన వారు. అందుచేతనే కావచ్చు. ఆ గ్రంథంలో ఆ దేవతకు ప్రాధాన్యం కనిపిస్తున్నది.

స్వప్నములలో, ధ్యానములలో తమకు కలిగిన అనుభవాలను తెలిపిన సాధకులు అక్కడక్కడ ఉంటూనే ఉంటారు. అయితే ఈ విధంగా గ్రంథాలను దర్శించినవారు తక్కువ. ఏమైనా ఇవి వైయక్తికములు. వానిలోని శాస్త్ర ప్రామాణ్యము ప్రధానము. పార్థసారథి గారి రచనలో ఆ నిబద్ధత ఉన్నది. కనుక గ్రంథోదయానికి కారణమేదైనా గ్రంథ గతవిషయము సముచితంగా, తత్వభావుకంగా వుంది. కనుక సహృదయులు ఆదరించగలరని భావిస్తున్నాను. విశేషించి ఈ గ్రంథాన్ని మాకు పరమాప్తులైన శ్రీలోకనాథశర్మ గారికి అంకితం చేయటం ఎంతో సంతోషించదగిన విషయము.

పరమేశ్వరియైన శ్రీమాత పార్థసారథిగారికి అభీష్టసిద్ధిని ప్రసాదించుగాక.

నారాయణ స్మృతులతో

సిద్ధేశ్వరానంద భారతీస్వామి

ప్రణతులు

2005వ సంవత్సరం ఫిబ్రవరి 25వ తారీకు రాత్రి, యథాప్రకారం స్నానం చేసి నిద్రకు ఉపక్రమించాను. కాని అంతకుముందు నుంచీ నాలో ఏదో తెలియని అలజడి. తపన. అది ఇది అని చెప్పలేను. మామూలుగా అమ్మవారి గురించి, ఉపనిషత్తుల గురించి ఆలోచిస్తున్నాను. కొద్దిరోజుల క్రితమే **'ఆత్మ సాక్షాత్కారము'** అనే గ్రంథం వ్రాయాలని నిర్ణయించుకున్నాను. పని జరుగుతోంది. కానీ ఈ రోజెందుకో సరిగాలేదు. అదే ఆలోచనలతో నిద్రకుపక్రమించాను. రాత్రివేళ నా కళ్ళముందు తేజోమయమైన తెల్లటి పెద్దకాంతి. ఆ కాంతిలో ఒక పుస్తకం తెరిచి ఉన్నది. దానిమీద **'లలితా రహస్యోపనిషత్తు'** అని వ్రాసి ఉంది. ఒక చిన్నబల్లమీద ఉన్నది ఆ పుస్తకం. నేను ఆ పుస్తకం దగ్గరకు వెళ్ళాను. అందులో ఏముందో నాకు తెలుస్తోంది. ఆ ఉపనిషత్తును ఉపన్యాసంగా చెబుతున్నాను. వినేవారు ఎవరూ నా కంటికి కనిపించటం లేదు. అయినా ఉపన్యాసం మాత్రం ఆగటం లేదు.

ఆ ఉపనిషత్తు కొన్ని భాగాలుగా కనిపిస్తోంది. పరమేశ్వరి తత్త్వము, సృష్టి, మంత్రము, యంత్రము, ముక్తి. ఈ విషయాల మీద ఉపన్యాసం సాగుతోంది. మధ్యలో మెలకువ వచ్చింది. గది అంతా చీకటి. ఎక్కడో కొంచెం వెలుతురు. ఇదంతా కలలా ఉన్నది. బయటకు వెళ్ళివచ్చి మళ్ళీ పడుకున్నాను. కళ్ళు మూసుకున్నాను. పూర్తిగా నిద్ర పట్టలేదు. అలా అని మెలకువగా లేదు. జాగ్రదవస్థకాదు. స్వప్నావస్థ అంతకన్నా కాదు. బయటి విషయాలేవీ తెలియటం లేదు. ఇందాక కనిపించిన పుస్తకం, కాంతి. మళ్ళీ ఉపన్యాసం. ఈ రకంగా తెల్లవార్లూ నిరాఘాటంగా కొనసాగింది ఉపన్యాసం.

తెల్లవారింది. విషయమంతా నా భార్యకు చెప్పాను. ఎక్కడిదీ లలితారహస్యోపనిషత్తు. నేను చదివిన వాటిలో ఎక్కడా లేదు. దీన్ని ఏమైనా గ్రంథస్థం చెయ్యమని ఆ తల్లి ఆదేశమా ? ఏమో ? తెలియదు. ఆ తరువాత కొద్దిరోజులకే **'శివరామకృష్ణ క్షేత్రం'**లో రామకోటి ఉత్సవాలు వచ్చాయి. ఆ ఉత్సవాల సందర్భంగా ఆహ్వానితులైన ఉపన్యాసకులలో నా పేరులేదు. కనీసం వాళ్ళదగ్గర నుంచి ఆహ్వాన పత్రంకూడా అందలేదు. కాని ఒకరోజు, ఆ తేదీకి రావలసిన దూరదర్శన్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ ఓలేటి పార్వతీశం గారు రాకపోవటంవల్ల, ఉత్సవాల కార్యనిర్వాహకులు నాకు ఫోను చేసి సాయంత్రం 7-00 గంటలకు మీ ఉపన్యాసం ఉన్నది. అన్నారు. ఎలాగూ ఖాళీయే కదా ! వెడదాం అనుకున్నాను. వెళ్ళి అక్కడ ఏం చెప్పాలి? చూద్దాం. అనుకుని అక్కడికి వెళ్ళి ఉపన్యాసానికి కూర్చున్నాను. చేతులో నేను వ్రాసిన 'దేవీ సప్తశతి భాష్యం' ఉన్నది. కాని ఆ క్షణంలో కలలో కనిపించిన ఉపనిషత్తును గురించి చెబితే బాగుంటుందేమో? అనిపించింది. ఆలోచించే వ్యవధానం లేదు. వినేవాళ్ళు ఏమైనా అనుకుంటారేమోననే భావనా లేదు. ఆ గంటసేపూ నాకల, ఉపనిషత్తు వీటిగురించే వివరించాను. అప్పడే, అక్కడే నిర్ణయించుకున్నాను దీన్ని గ్రంథస్థం చెయ్యాలని. అయితే ప్రారంభించిన పుస్తకం 'ఆత్మసాక్షాత్కారం' పూర్తి అయిన తరువాత, నా స్వప్నాన్ని నిజం చెయ్యటానికి ప్రారంభించాను. ఏడు అధ్యాయాలలో ఈ ఉపనిషత్తు వచ్చింది. ఇంకా వస్తుంది అనుకుంటూనే వ్రాస్తున్నాను. కాని ఉన్నట్టుండి పూర్తయిపోయింది.

ఇది నా గొప్పతనం కాదు. ఇందులో నా ప్రమేయం ఏమీలేదు. ఆ పరమేశ్వరి కావాలనుకుని ఉంటుంది. నాతో వ్రాయించింది. నేను కేవలం నిమిత్తమాత్రుణ్ణి. ఇదంతా పరమేశ్వరి కృప. అంతే.

గ్రంథరచనకు నాకు అన్నివిధాలా సహకరించిన నాభార్య రమాదేవికి కృతజ్ఞతలు.

గతంలో వ్రాసిన గ్రంథాలలాగానే దీన్ని కూడా ఆదరిస్తారని భావిస్తూ... లలితా రహస్యోపనిషత్తు అను ఈ గ్రంథము శ్రీవిద్యా పూర్ణాదీక్షాపరులు, ధర్మపురుష శ్రీ యాబలూరి లోకనాథశర్మ, శ్రీమతి విమలాకామేశ్వరి గార్లకు అంకితం యివ్వబడినది. ఆ పరమేశ్వరి వారికి వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ .....

పార్థివనామ సంవత్సర	భవదీయుడు
చైత్రబహుళ సప్తమి	**క్రోవి పార్థసారథి**
శనివారం, 30-4-2005	**(పరమానందనాథ)**

విషయసూచిక

శ్రీ లలితారహస్యోపనిషత్తు

ఒకటవ అధ్యాయము (పరమేశ్వరీ తత్త్వము)

పూర్వకాలంలో ఒకసారి దేవతలంతా ఒకచోట చేరి పరతత్త్వాన్ని గురించి చర్చించుకోవటం మొదలుపెట్టారు. దక్షిణ దిక్కుకు పాలకుడు, మృత్యుదేవత అయిన యముడు లేచి “ఈ జగత్తులో ఆయువు తీరిన వారందరినీ నేను తీసుకువస్తున్నాను. వారు చేసిన పాపపుణ్యాల ననుసరించి వారు స్వర్గసుఖాలు, నరకయాతనలు అనుభవిస్తున్నారు. ఇంతకీ జీవరాశి జన్మకు కారణం ఏమిటో నాకు తెలియలేదు” అన్నాడు. ఆ తరువాత పశ్చిమ దిక్కును పాలించే వరుణుడు లేచి “లోకంలో అనేక రకాల జీవజాలమున్నది. అందులో భూచరాలు, జలచరాలు, ఖగచరాలు ఇలా అనేక జీవులున్నాయి. ఇవన్నీ ఏ రకంగా ఉద్భవించాయి ?” అని అడిగాడు. తూర్పు దిక్కును పాలించేవాడు, దేవరాజు అయిన ఇంద్రుడు లేచి “జగత్తులో జీవరాశిని సృష్టిస్తున్నది చతుర్ముఖబ్రహ్మ. స్థితికారకుడు విష్ణువు. లయకారకుడు రుద్రుడు. ఈ త్రిమూర్తులవల్లనే జగత్తంతా ప్రవర్తిల్లుతున్నది. అయితే దేవతలంతా ఏ రకంగా ఉద్భవించారు ? ఈ త్రిమూర్తుల జననానికి కారణం ఏమిటి ? అనే విషయాలు మాత్రం బోధపడటంలేదు. ఓ సృష్టికర్తా! దేవతలందరిలోకీ నువ్వే ముందుగా పుట్టినవాడవు. కాబట్టి మా సంశయాలన్నీ నువ్వే తీర్చాలి. అసలు ఈజగత్తు ఏరకంగా ఆవిర్భవించింది? జగదావిర్భావానికి కారకులెవరు ? మొదలైన విషయాలన్నీ మాకు తెలియజెయ్యవలసింది” అన్నాడు. ఆ మాటలు విన్న బ్రహ్మదేవుడు, “దేవతలారా ! మీరడిగిన ప్రశ్నలకు సమాధానం పూర్తిగా నాక్కూడా తెలియదు. ఈ విషయాలన్నీ తెలిసినవాడు శ్రీమన్నారాయణుడు. ఆయనే

విరాడ్రూపి. కాబట్టి మనమంతా ఆయన దగ్గరకు పోయి మనసంశయాలు నివృత్తి చేసుకుందాం." అన్నాడు. దేవతలంతా కలిసి శ్రీమన్నారాయణుని దగ్గరకు పోయి ఆయనను పరిపరివిధాల స్తుతించారు. వారి భక్తికి ప్రసన్నుడైన నారాయణుడు దేవతలనుద్దేశించి "మీరు వచ్చిన పనిఏమిటి? నావల్ల మీకు ఏంకావాలి ?" అన్నాడు. అప్పుడు బ్రహ్మదేవుడు శ్రీమన్నారాయణునికి నమస్కరించి "దేవాధిదేవా ! మాకందరికీ చిన్న అనుమానం వచ్చింది. అసలు ఈ జగత్తు ఏ రకంగా సృష్టించబడుతోంది? దీనికి కారకులెవరు ? ఈ విషయాలు మాకు సవిస్తరంగా తెలియచేయ వలసినది" అన్నాడు. ఆ మాటలు విన్న శ్రీమన్నారాయణుడు "దేవతలారా! మీకందరికీ ఈ జగసృష్టి గురించి అనుమానం వచ్చింది. దాన్ని మీకు వివరిస్తాను. ఇది రహస్యాతి రహస్యమైనది. విద్వాంసులు మాత్రమే తెలుసుకోదగ్గది. లౌకికవాదులకు, ఆచారహీనులకు ఈ విషయాలు చెప్పరాదు.

ఈ చరాచర జగత్తును సృష్టించినది ఆ పరమేశ్వరి. ఆవిడే సృష్టి స్థితి సంహారకారిణి. సృష్టి ప్రారంభానికి ముందు ఈ జగత్తంతా శూన్యంగా ఉండేది. ఆ శూన్యాన్నంతటినీ పరమేశ్వరి ఆవరించి ఉన్నది. పరమేశ్వరికి రెండు రూపాలున్నాయి. 1. నిరాకారము 2. సాకారము. సృష్టి ప్రారంభానికి ముందు ఆవిడ నిరాకారంగా ఉండేది. ఆ పరమేశ్వరి నుంచే ఈ జగత్తంతా ఆవిర్భవించింది. మళ్ళీ ఆవిడలోనే లయమవుతున్నది. ఆదేవి వల్లనే బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఇంద్రాది దేవతలు, అష్టవసువులు, దిక్పాలకులు, ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, సూర్యుడు, చంద్రుడు, గ్రహాలు, మరుత్తులు అందరూ ఉద్భవించారు. ఆ పరమేశ్వరివల్ల ఒక్క దేవతలే కాదు, గరుడ, గంధర్వ, యక్ష, కిన్నెర, కింపురుష, సిద్ధ, సాధ్య, నాగగణాలన్నీ ఆవిర్భవించాయి.

ఆ పరమేశ్వరియే సత్యమైనది, నిత్యమైనది శాశ్వతమైనది. భూమి, ఆకాశము, దశదిశలు, పైభాగము, క్రింది భాగము, మధ్యభాగము అంతా పరమేశ్వరి స్వరూపమే. నేల నీరు, నింగి అంతా పరమేశ్వరియే. ఆమె అద్వితీయము, అనన్యము, అజరామరము అయినది. ఆది మధ్యాంత రహితమైనది. ఆమె గతంలో (భూతకాలంలో) ఉన్నది. వర్తమానంలో ఉన్నది, భవిష్యత్తులో ఉంటుంది. త్రికాలరూపి ఆమె, త్రికాలాతీతమైనది ఆమె. ఆమెతో సమానమైన వారుగాని, అంతకు మించిన వారుగాని, ఎవరూ లేరు. ఆమె కామకళ, శృంగారకళ, సాదాఖ్యకళ. అండజాలు, శ్వేదజాలు, ఉద్బిజాలు, స్థావరాలు, జంగమాలు, పశువులు, పక్షులు, జంతువులు అన్నీ ఆమెవల్లనే ఆవిర్భవించాయి. ఆమెయే పరాశక్తి. శాంభవి. కాదివిద్య, హాదివిద్య ఆమెయే. ఆవిడే త్రిపురసుందరి. ఆ పరమేశ్వరియే ఈ జగసృష్టికి కారకురాలు" అన్నాడు. ఆ మాటలు విన్న దేవతలు "దేవా! ఆ పరమేశ్వరి ఈ సృష్టిని ఎలా చేసిందో వివరించండి" అన్నారు. చెప్పటం ప్రారంభించాడు శ్రీమన్నారాయణుడు.

రెండవ అధ్యాయము (జగత్‌సృష్టి)

వికారాలు లేనిది. సత్యజ్ఞానానందమయమైనది. పరిపూర్ణమైనది. సనాతనముగా ఉన్నది. ఏకముగా ఉన్నది. రెండవది లేనిది. అదే పరబ్రహ్మ స్వరూపము. నిరాకారమైన ఆ పరబ్రహ్మయందు ఎడారులలో ఎండమావి లాగా, స్థాణువునందు దొంగవాడిలాగా, స్ఫటికంలోని రేఖలులాగా అనిపిస్తూ తెలుపు, ఎరుపు, నలుపు గల సమాన త్రిగుణాలు కలిగి, అనిర్వచనీయమైన మూలప్రకృతి ఉన్నది. ఆ మూలప్రకృతిలో ప్రతిబింబించిన పరబ్రహ్మమే సాక్షి చైతన్యము.

గతంలో ప్రళయం వచ్చి జగత్తంతా నాశనమైపోయింది. ఆ సమయంలో కర్మ క్షయమైన జీవరాశి అంతటికీ మోక్షం సిద్ధించింది. కర్మక్షయం కాకుండా ఉన్న జీవరాశి, తమ కర్మను తమతో మూట కట్టుకుని మాయలో కలిసిపోయింది. ఇప్పుడు భూమి జలంలోను, జలం అగ్నిలోను, అగ్ని వాయువునందు, వాయువు ఆకాశమందు, ఆకాశము అహంకారము నందు, అహంకారము మహత్తత్త్వమందు, మహత్తత్త్వము అవ్యక్తమందు లీనమయినాయి. ఈ అవ్యక్తమే 'మాయ' అనబడుతుంది. ఈ రకంగా పంచభూతాలను, జీవరాశిని తనలో లీనం చేసుకున్నదయిన మాయ అనబడే అవ్యక్తము ఆ పరమేశ్వరిలో కలిసిపోయింది. అదే ఇప్పుడు మనం చెబుతున్న నిరాకారయై సృష్టి ప్రారంభానికి ముందున్న పరమేశ్వరి.

ఈ పరమేశ్వర తత్త్వానికి రూపంలేదు. గుణంలేదు. లింగభేదం అసలే లేదు. ఇది తేజోమయమైన కాంతిపుంజము. బ్రహ్మవాదులు దీన్నే పరమేశ్వరుడు అనికూడా అంటారు. కాబట్టి దేవతలారా ! పరమేశ్వరుడు అన్నా, పరమేశ్వరి అన్నా ఒకటే. ఈ రెండు పదాలకు తేడాలేదు. అది శివశక్తుల ఏకీకృత రూపము.

సృష్టి ఆవిర్భావానికి ముందు, జగత్తునంతటినీ తనలో నిక్షిప్తం చేసుకున్న ఆ పరమేశ్వరి స్వరూపం ఒక్కటే ఉన్నది. ఆ పరమేశ్వరి ఇప్పుడు సృష్టి చెయ్యాలి అనుకుంది. సృష్టి ఎందుకు చెయ్యాలి ? తనలీలా వినోదం కోసం మాత్రం కాదు. అంతకుముందు ప్రళయం సంభవించినప్పుడు కర్మక్షయం కాకుండా, ఆ కర్మతోపాటుగా తనలో లీనమైపోయిన జీవులన్నింటికీ కర్మక్షయం చేసి వాటికి మోక్షం కల్పించాలనే ఉద్దేశ్యంతోనే సృష్టి చెయ్యాలనుకున్నది ఆ పరమేశ్వరి. ఇక సృష్టి ప్రారంభమైంది. నిరాకారంగా ఉన్న ఆ పరమేశ్వరి నుంచి సత్త్వగుణ ప్రధానమైన అవ్యక్తం

బయటకు వచ్చింది. ఇదే మాయ. ఈ అవ్యక్తము లేక మాయ అనేది పరమేశ్వరి అధీనంలోనే ఉంటుంది. ఈ మాయవల్లనే సృష్టిస్థితిలయాలు అన్నీ జరుగుతున్నాయి. ఇప్పుడు అవ్యక్తము నుంచి రజోగుణ ప్రధానమైన మహత్తత్త్వము పుట్టింది. ఇదే హిరణ్యగర్భుడు. ఈ మహత్తత్త్వము నుంచి తమోగుణ ప్రధానమైన అహంకారం పుట్టింది. అదే విరాడ్రూపము. ఈ రకంగా పరమేశ్వరి నుంచి అవ్యక్తము (మాయ) మహత్తత్త్వము (హిరణ్యగర్భుడు) అహంకారము (విరాడ్రూపము) ఆవిర్భవించాయి.

ఈ అహంకారంనుంచే నామరూపాత్మకమైన జగత్తు ఆవిర్భవించింది. ముందుగా రూపాత్మక జగత్తు. అహంకారము నుంచి పంచభూతాల సూక్ష్మరూపాలయిన తన్మాత్రలు ఆవిర్భవించాయి. అవే శబ్ద స్పర్శరూప రస గంధాలు. ఆ తరువాత తన్మాత్రల స్థూల రూపాలయిన పంచభూతాలు ఆవిర్భవించినాయి. పంచభూతాలలో ముందుగా పుట్టింది ఆకాశము. ఆకాశము నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్ని నుంచి జలము, జలంనుంచి భూమి, భూమినుంచి ఓషధులు, ఓషధులనుంచి వనస్పతులు, వనస్పతుల నుంచి అన్నము వచ్చింది. ఈ రకంగా రూపాత్మకమైన జగత్తు ఏర్పడింది. ఇక నామాత్మకమైన జగత్తు. అవ్యక్తము నుంచి ముందుగా ఓంకారము పుట్టింది. ఓంకారము నుంచి అకార ఉకార మకారాలు పుట్టాయి. వాటి నుంచి అక్షర సమామ్నాయం పుట్టింది. అక్షరాల నుంచి పదాలు, వాక్యాలు, మంత్రాలు, వేదాలు, శాస్త్రాలు, పురాణాలు, సంగీతము, సాహిత్యము ఏర్పడ్డాయి. ఈ రకంగా ఆ పరమేశ్వరి నుంచే నామ రూపాత్మకమైన జగత్తు ఏర్పడింది.

ఇప్పుడు పంచభూతాలు పంచీకరణ చెయ్యబడ్డాయి. పంచభూతాలలో మొదటగా ఆకాశం పుట్టింది. ఆకాశంలో దానియొక్క లక్షణం శబ్దము

మాత్రమే ఉన్నది. ఆకాశం నుంచి వాయువు వచ్చింది. వాయువు లక్షణం స్పర్శ. అందుచేత వాయువులో ఆకాశ లక్షణమైన శబ్దము, వాయు లక్షణమైన స్పర్శ ఉన్నాయి. తరువాత వాయువు నుంచి అగ్ని వచ్చింది. అగ్ని లక్షణము తేజస్సు. అగ్నియందు ఆకాశ లక్షణమైన శబ్దము, వాయు లక్షణమైన స్పర్శ, అగ్ని లక్షణమైన, తేజస్సు (అదే రూపము) మూడూ ఉన్నాయి. అలాగే అగ్నినుంచి జలము వచ్చింది. జలముయొక్క లక్షణము రసము. జలము నందు శబ్దస్పర్శ రూపరసములు ఉన్నాయి. జలమునుండి భూమి ఏర్పడింది. భూమి లక్షణము గంధము. భూమియందు శబ్ద స్పర్శ రూప రసగంధాలు ఏర్పడ్డాయి. ఈ పంచభూతాలలో గుణ త్రయాన్ని కలిపి అనంతకోటి బ్రహ్మాండాలను, ఆ బ్రహ్మాండాలకు తగిన లోకాలను, ఆ లోకాలకు తగిన గోళాలను, స్థూలశరీరాలను సృష్టించింది పరమేశ్వరి.

పరమేశ్వరి పంచ మహాభూతాల యొక్క రజోగుణాన్ని నాలుగు భాగాలుగా చేసి, అందులో మూడు భాగాల నుంచి ప్రాణశక్తిని, నాల్గవ భాగంతో కర్మేంద్రియాలను సృష్టించింది. తరువాత పంచ మహాభూతాల యొక్క సత్త్వగుణాన్ని నాలుగు భాగాలు చేసి, అందులోని మూడు భాగాల నుంచి అంతఃకరణ చతుష్టయాన్ని, నాల్గవ భాగంతో జ్ఞానేంద్రియాలను సృష్టించింది. ఇంద్రియ పాలకులను సృష్టించింది. ఇప్పుడు పంచభూతాల తమోగుణమైన అహంకారముతో స్థూలశరీరాలను సృష్టించింది. ఈ రకంగా జగత్తులో జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, స్థూల సూక్ష్మ శరీరాలను సృష్టించటం జరిగింది. ఇప్పుడు ఆ పరమేశ్వరి తాను సృష్టించిన స్థూల శరీరాలలో ప్రవేశించాలనుకుంది. అనుకున్నదే తడవుగా బ్రహ్మరంధ్రం ద్వారా స్థూలశరీరాలన్నింటియందు వ్యాపించి సర్వవ్యాపకమైంది అన్నాడు శ్రీమన్నారాయణుడు.

మూడవ అధ్యాయము (స్థూలశరీరము)

దేవదేవా ! ఆ పరమేశ్వరి ఈ జగత్తును సృష్టించింది. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు సృష్టించింది. మరి మిగిలిన దేహము, అంగాలు ఏ రకంగా ఏర్పడ్డాయో వివరించండి అన్నారు దేవతలు. ఆ మాటలు విన్న నారాయణుడు చెప్పటం మొదలుపెట్టాడు.

దేవతలారా ! పరమేశ్వరి పంచీకృత మహాభూతాల సాయంతో వ్యష్టిరూపం లోను, సమిష్టి రూపంలోను స్థూలదేహాలను యధాప్రకారం సృష్టి చేయటం జరిగింది. ఆ దేహాలలో కపాలము, చర్మము, నరాలు, ఎముకలు, మాంసము, గోళ్ళు మొదలైనవి పృథివి అంశలు. రక్తము, మూత్రము, లాలాజలము, స్వేదము మొదలైనవి జలముయొక్క అంశలు. ఆకలి, దప్పిక, ఉష్ణము, మోహము, మైధునము మొదలైనవి అగ్నియొక్క అంశలు. నడచుట, దాటుట, శ్వాసవిడచుట, పీల్చుట మొదలైనవి వాయువు యొక్క అంశలు. కామక్రోధాలు ఆకాశముయొక్క అంశలు. ఈ రకంగా కర్మసంచితము, చర్మాదులతోకూడినది, బాల్యాద్యవస్థలను అభిమానించేది, బహుదోషాలకు ఆశ్రయము అయిన స్థూలదేహము ఆవిర్భవించింది.

ఇక సూక్ష్మదేహము ఏ విధంగా వచ్చింది అంటే, పంచభూతాల రజోగుణాన్ని నాలుగు భాగాలుగా చేసి అందులోని మూడు భాగాలనుంచి ప్రాణాన్ని సృష్టించటం జరిగింది. ప్రాణాలు ఐదు రకాలు. అవి 1. ప్రాణ 2. అపాన 3. వ్యాన 4. ఉదాన 5. సమాన వాయువులు.

1. ప్రాణవాయువు : ఇది హృదయమందుంటుంది. దీనికి అధిష్ఠాన దేవత 'విశిష్ఠకుడు', ఇది శ్వాసాదులను ఇడపింగళనాడుల గుండా బయటకు పంపుతుంది.

2. అపాన వాయువు : ఇది గుదస్థానంలో ఉంటుంది. దీనికి అధిష్ఠానదేవత విశ్వకర్త. ఇది అధోముఖంగా సంచరిస్తూ శుక్లము, మలము, మూత్రము, రక్తములను కుహూనాడి, సినీవాలి నాడుల ద్వారా బయటకు పంపుతుంది. దీనిచే మలమూత్రాలు అధోముఖంగా విసర్జించబడతాయి.

3. వ్యానవాయువు : ఇది నాభిస్థానంలో ఉంటుంది. దీనికి అధిష్ఠానదేవత 'విశ్వయోని' ఇది బయటి శీతోష్ణాలను లోపలకు, లోపలి శీతోష్ణాలను బయటకు పంపుతూ ఉంటుంది. భుజించిన ఆహారాన్ని శరీరమంతా వ్యాపింపచేస్తుంది.

4. ఉదాన వాయువు : ఇది కంఠస్థానంలో ఉంటుంది. దీనికి అధిష్ఠాన దేవత 'అజడు' ఇది మనసుయొక్క సంకల్ప వికల్పాలను మాటల రూపంలో వెల్లడిస్తుంది. సుషుప్త్యవస్థలో ఇంద్రియాలను స్వాధీనం చేసుకుని తనకు కారణమైన అజ్ఞానంలో మునిగిపోతుంది. జాగ్రదావస్థలో ఇంద్రియాలను వాటి వాటి స్థానాలలో నిలబెడుతుంది. ఈ వాయువు సుషుమ్నగుండా సహస్రారందాకా సంచరిస్తుంది.

5. సమానవాయువు : ఇది శరీరంలోని అన్ని అంగాలయందు సమానంగా వ్యాపించి ఉంటుంది. దీనికి అధిష్ఠాన దేవత 'జయుడు'. ఇది జఠరాగ్నిని ప్రజ్వలింపచేసి తిన్న ఆహారాన్ని అరిగించి శరీరంలోని డెబ్బైరెండు వేల నాడీ మండలానికి సమానంగా అందిస్తుంది.

ఉపవాయువులు కూడా ఐదు ఉన్నాయి. వీటిలో 1. నాగవాయువు వాంతిని కలిగిస్తుంది. 2. కూర్మవాయువు కనురెప్పలను కదిలిస్తుంది. 3. కృకరవాయువు తుమ్ములను కలిగిస్తుంది. 4. దేవదత్త వాయువు ఆవలింతలు కలిగిస్తుంది. 5. ధనుంజయ వాయువు శరీరమంతా వ్యాపించి శరీరాభివృద్ధిని కలిగిస్తుంది.

ఇక పంచభూతముల రజోగుణముయొక్క నాల్గవభాగంతో కర్మేంద్రియాలను సృష్టించటం జరిగింది. వాక్కు, పాణి, పాదము, గుదము, ఉపస్థ అనేవి కర్మేంద్రియాలు. మాట్లాడటము, ఇవ్వటము, నడవటము, విడుచుట, ఆనందించటము అనేవి కర్మేంద్రియాల విషయాలు. అగ్ని, దేవేంద్రుడు, ఉపేంద్రుడు, మృత్యువు, ప్రజాపతి, కర్మేంద్రియాలకు వరుసగా అధిష్ఠాన దేవతలు.

ఇక పంచభూతముల సత్త్వగుణాన్ని నాలుగు భాగాలు చేసి, అందులోని మూడు భాగాలతో అంతఃకరణను సృష్టించటం జరిగింది. మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనేవి అంతఃకరణ చతుష్టయము. ఆలోచించటము, నిశ్చయించటము, స్మరించటము, అభిమానించటము, అనుసంధానము చేయటము, అనేవి అంతఃకరణ విషయాలు. గళము, వదనము, నాభి, హృదయము, భ్రూమధ్యము అనేవి అంతఃకరణ స్థానాలు. చంద్రుడు, విష్ణువు, చతుర్ముఖబ్రహ్మ శంభుడు అంతఃకరణ చతుష్టయానికి వరుసగా అధిష్ఠాన దేవతలు. పంచభూతాల సత్త్వగుణం నాల్గవ భాగంతో జ్ఞానేంద్రియాలను సృష్టించటం జరిగింది. శ్రోత్రము, చర్మము, చక్షువు, జిహ్వ, ఘ్రాణము అనేవి జ్ఞానేంద్రియాలు. శబ్ద స్పర్శ రూప రస గంధాలు జ్ఞానేంద్రియాల విషయాలు. దిక్కులు, వాయువు, భానుడు, వరుణుడు, అశ్వనీ దేవతలు జ్ఞానేంద్రియాలకు వరుసగా అధిష్ఠాన దేవతలు. ఇక పంచకోశాలు. 1. అన్నమయ 2. ప్రాణమయ 3. మనోమయ 4. విజ్ఞానమయ 5. ఆనందమయ కోశాలనే పంచకోశాలంటారు. అన్న రసముతో జన్మించి, అన్న రసముతో వృద్ధి చెంది, అన్న రసమైన పృథివిలోనే లీనమయ్యేది అన్నమయకోశము. ఇదే స్థూలదేహము. కర్మేంద్రియాలతో కూడిన ప్రాణమే ప్రాణమయకోశము. కర్మేంద్రియ సహితమైన మనస్సు

మనోమయకోశము. ఈ మూడు కోశముల సమూహమే లింగదేహము. ఇదే సూక్ష్మదేహము. స్వస్వరూప జ్ఞానముతో ప్రకాశించేది ఆనందమయ కోశము. ఇదే కారణదేహము.

జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, ప్రాణాలు, పంచభూతాలు, అంతః కరణ చతుష్టయము, కామము, కర్మము, తమస్సు (అవిద్య). ఈ ఎనిమిది గల దేహము అష్టపురము. ఆ పరమేశ్వరి ప్రతిదేహంలోనూ ప్రవేశించి బుద్ధియందుండి 'విశ్వుడు' అనబడింది. విజ్ఞానాత్ముడని, చిదాభాసుడని, విశ్వుడు అని, వ్యావహారికుడని, కర్మభవుడని, స్థూలశరీరాభిమాని అని అతనికి పేర్లు. ఒక్కొక్క సూక్ష్మదేహమందు ప్రవేశించిన సూత్రాత్మ మనస్సు నధిష్ఠించి 'తైజసుడు' అని పిలవబడింది. ఇతడికి తైజసుడు, ప్రాతిభాసికుడు, స్వప్నకల్పికుడు అని పేర్లు. ఆ పరమేశ్వరి మాయతో కలిసి ఒక్కొక్క కారణ దేహమందు ప్రవేశించి 'ప్రాజ్ఞుడు' అనబడింది. ఇతడికి ప్రాజ్ఞుడు, అవిచ్ఛిన్నుడు, పారమార్థికుడు, సుషుప్త్యభిమాని అని పేర్లు. వేదాంత శ్రవణం వల్ల ప్రాప్తించే ఫలితము ప్రాజ్ఞుడికే చెందుతుంది.

జీవుడికి జాగ్ర, స్వప్న, సుషుప్తి, తురీయము, తురీయాతీతము అనే ఐదు అవస్థలున్నాయి. ఆయాదేవతల అనుగ్రహంతో, జ్ఞానేంద్రియాలతో, శబ్దాది విషయ గ్రహణ జ్ఞానము జాగ్రదావస్థలో జరుగుతుంది. జాగ్రదావస్థలో జీవుడే సర్వకర్మలకు కర్త, భోక్త అవుతున్నాడు.

వాగాదికరణములు ఉపరమించినప్పుడు, గ్రాహ్యగ్రాహకరూపాలు సృష్టించటమే స్వప్నావస్థ. జాగ్రదావస్థలో విశ్వుడుగా ఉన్న జీవుడే స్వప్నావస్థలో తైజసుడుగా నాడీమండలములో సంచరిస్తూ విషయాలను సృష్టించుకుని, స్వేచ్ఛగా అనుభవిస్తాడు.

జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలను బంధించి, మనస్సును కూడా నశింపచేసిన స్థితే తురీయము. తురీయస్థితి చేరినవాడే జీవన్ముక్తుడు. తురీయాతీతుడు విదేహ ముక్తుడు. ఈ రకంగా ఆ పరమేశ్వరి స్థూల శరీరాన్ని ఆవిర్భవింపచేసింది. అన్నాడు శ్రీమన్నారాయణుడు.

నాల్గవ అధ్యాయము (మాయాస్వరూపము)

"దేవదేవా ! శ్రీమన్నారాయణా ! పరమేశ్వరి ఈ జగత్తును సృష్టించింది సరే ! ఆవిడ మాయా స్వరూపిణి అంటారు కదా ! అసలు మాయ అంటే ఏమిటి ? ఆ మాయా స్వరూపాన్ని వివరించవలసినది" అన్నాడు సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు. శ్రీమన్నారాయణుడు చెప్పటం మొదలుపెట్టాడు.

అనాది అయినది, అంతము గలది, ప్రమాణాలకు, అప్రమాణాలకు సాధారణమైనది మాయ. ఇది సత్తు కాదు, అసత్తు కాదు. సదసత్తు అంతకన్నా కాదు. స్వయముగా అధికమైనది. వికారములు లేనిది. నిరూపించటానికి వీలైన లక్షణాలు లేనిది మాయ.

జీవులకు అజ్ఞానము నశించి పోగా, సత్త్వగుణ ప్రధానులైన వారికి ఆత్మ సాక్షాత్కారము కలుగుతుంది. అజ్ఞానులకు అది సాధ్యంకాదు. వికారాలకు అనగా మార్పులకు తల్లియై, శాశ్వతమైన భగవదాజ్ఞా రూపమైనది మాయ. ఈ మాయవల్లనే జగత్తులో అనేక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీనివల్లనే జగత్తు నిర్మించబడుతున్నది. మాయ అనేది పరమేశ్వరిని ఆశ్రయించి ఉంటుంది. ఇది గౌరవమైనది. అంతము గలది. పుట్టించేది. భూతములందు ప్రకాశించేది. తెలుపు ఎరుపు నలుపు మొదలుగా గల అనేక రంగులు గలది. రకరకాల రూపాలు గలది. కోరికలు కలిగించేది. కోరికలు తీర్చేది. విషయ శూన్యమైనది. ఈ మాయవల్ల ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు కనిపిస్తుంది. నిత్యము, సత్యము, శాశ్వతము

అయినది ఆ పరమేశ్వరి. కాని మాయా ప్రభావంతో భగవంతుడు లేడు అనిపిస్తుంది. అశాశ్వతమైన జగత్తు శాశ్వతము అనిపిస్తుంది. భార్యా బిడ్డలు, ధనధాన్యాలు, భోగభాగ్యాలు, ఇవన్నీ నిజం అనిపిస్తుంది. లోకంలో జీవి వాటికోసమే ప్రాకులాడతాడు. కాని ఇవన్నీ నశించిపోయేవే. ఎడారియందు ఎండమావిలాగా, సూర్యకాంతిలో ముత్యపుచిప్ప వెండి పాత్రలా కనిపించి నట్లుగా, మాయా ప్రభావంచేత అశాశ్వతమైనవన్నీ శాశ్వతంగా కనిపిస్తాయి. అనిత్యమైనవి నిత్యంగా అనిపిస్తాయి. ఈ మాయా ప్రభావంచేతనే మానవుడు తాను సృష్టించిన ద్రవ్యాన్ని సంపాదించటానికి తానే పరుగులు పెడతాడు. ఈ జగత్తంతా నిజమనే భ్రమలో ఉంటాడు. ఈ మాయ ఎంత గొప్పది అంటే, తన కళ్ళ ఎదురుగా జీవులు మరణిస్తున్నా, కట్టడాలు కూలిపోతున్నా, వస్తువులు నశిసిస్తున్నా, మానవుడు అది నిజమని నమ్మలేడు. చివరకు తన జీవితం శాశ్వతం కాదు. అని తెలిసికూడా దానిమీద వ్యామోహం వదులుకోలేడు. అహంకార మమకారాలనుంచి బయటకు రాలేడు. జీవుడు అవిద్యా సంబంధంచేత మాయ అనే వలలో గట్టిగా చిక్కుకుపోయాడు. సృష్టి జరిగేటప్పుడు ముందుగా అవ్యక్తము, మహత్తత్త్వము, అహంకారము వచ్చినాయి. అహంకారము నుంచి తన్మాత్రలు, వాటినుంచి పంచభూతాలు ఆవిర్భవించాయి. అయితే సృష్టిక్రమంలో మొదటిదయిన అవ్యక్తమే మాయ. అవ్యక్తము అంటే కంటికి కనిపించనిది. అదే మాయ. ఈ మాయ పరమేశ్వరుణ్ణి ఆవరించి ఉంటుంది. అంటే జీవుడికీ, పరమేశ్వరుడికీ మధ్యన అడ్డుగా ఉంటుంది. ఈ మాయను గనక ఛేదించగలిగితే ఆత్మ సాక్షాత్కారమవుతుంది.

మాయ అనేది నీటి గుంటలో నాచువంటిది. ఈ నాచును దూరంగా త్రోసేస్తే వెళ్ళిపోతుంది. కాని మళ్ళీ వచ్చి చేరుతుంది. అలాగే వేదాంత విచారము, సజ్జన సాంగత్యము చేసినంత కాలము ఈ మాయ వదలి

వేసినట్టుగా కనిపిస్తుంది. కాని ఆ తరువాత వెంటనే వచ్చి చేరుతుంది. అంటే విషయవాంఛలయందు మనసు ఎప్పుడయితే లగ్నమవుతుందో, అప్పుడు మాయ ఆవరించింది అని అర్థం. అయితే ఈ మాయ పరమేశ్వరుణ్ణి ఆవరించి ఉంటుంది కదా. దీనివల్ల ఆయనకు అపాయం లేదా ? అంటే – జగత్తులో ప్రతిప్రాణి మాయకు లోబడే ఉంటుంది. ఆ పరమేశ్వరి ఒక్కతే మాయకు అతీతురాలు. మాయ అనేది పరమేశ్వరి అధీనంలోనే ఉంటుంది. పాము కోరలలో ఉన్న విషంవల్ల పాముకు ఏ రకంగానూ హాని జరగదు. కాని దానిచేత కాటు వేయబడ్డ ఇతరులకు మాత్రం హాని జరుగుతుంది. అలాగే పరమేశ్వరిని ఆవరించిన మాయవల్ల ఆమెకు ఏ అపకారము జరగదు.

మాయచేత కప్పబడిన మానవుడు, తాను మాయా ప్రభావానికి లోనై ఉన్నాను అని తెలుసుకున్నట్లైతే, మాయ అతన్ని వదిలిపెడుతుంది. దెయ్యం పట్టి పిచ్చివేషాలు వేస్తున్న మనిషికి, తనకు దెయ్యం పట్టిందనే విషయం తెలిస్తే, ఆ దెయ్యం మరుక్షణమే అతని వదలివేస్తుంది. అలాగే మాయకూడా. నిద్రపోతున్నప్పుడు స్వప్నం వస్తుంది. అందులో రకరకాల విషయాలు అనుభవంలోకి వస్తాయి. కాని నిద్ర లేచిన తరువాత అదంతా కల, భ్రాంతి అనిపిస్తుంది. అదేవిధంగా కంటికి కనిపించే ఈ జగత్తంతా భ్రమ అని నిశ్చయంగా తెలుసుకోగలిగితే మాయ తొలగిపోతుంది. మాయ విడిపోతే భగవత్సాక్షాత్కారము జరుగుతుంది. అదే ఆత్మసాక్షాత్కారము.

జీవాత్మ పరమాత్మలమధ్య మాయ అనే తెర ఉన్నది. అది పరమాత్ముని దర్శించటానికి అడ్డుగా ఉన్నది. ఆ తెరగనక తొలగించగలిగితే ఆత్మదర్శన మవుతుంది.

మాయ రెండు విధాలు 1) అవిద్యామాయ 2) విద్యామాయ.

1) అవిద్యామాయ : ఇదే అజ్ఞానము. ఇది కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములని ఆరురకాలుగా ఉంటుంది. దీనివల్లనే మానవుడికి నేను నాది అనే అహంకార మమకారాలు ఏర్పడతాయి. ఈ కారణంగానే మానవుడు సంసారానికి బందీ అవుతున్నాడు.

2) విద్యామయ : ఇది భగవంతుని సన్నిధికి తీసుకుపోతుంది. విద్యామాయ వివేకము, వైరాగ్యము అని రెండు విధాలుగా ఉన్నది. దీనిని ఆశ్రయించిన వారు భగవంతుని శరణు పొందుతారు.

విద్యామాయ వ్యక్తం కాగానే అవిద్యామాయ తొలగిపోతుంది. మురికిగా ఉన్న నీటిలో సూర్యచంద్రుల ప్రతిబింబం కనిపించదు. అలాగే మాయ అనే పొర తొలగిపోనంత వరకు, నేను నాది అనే అహంకార మమకారాలు నశించనంత వరకు, పరమేశ్వర సాక్షాత్కారం జరగదు.

పరమేశ్వరుడనే సూర్యుడు ఈజగత్తును ప్రకాశింపజేస్తున్నాడు. కాని చిన్న మబ్బు తునక గనక అడ్డు వచ్చినట్లైతే సూర్యుడు కంటికి కనిపించడు. అలాగే మాయ అనే తెర పరమేశ్వరుణ్ణి మనం చూడకుండా కప్పివేస్తుంది.

చెరువులో నాచు పేరుకొని ఉన్నది. దాన్ని చెదరగొట్టినా మళ్ళీ వచ్చి యథాస్థితికి చేరుతుంది. కాని దానికి ఏదైనా ఒక కర్ర అడ్డుగా పెడితే, అది తిరిగిరాదు. అలాగే జ్ఞానము అనే కర్రతో మాయను నిరోధించినట్లైతే పరమాత్మ దర్శనం కలుగుతుంది.

నిర్మలమైన ఆకాశంలో సూర్యుడు ప్రకాశిస్తుంటాడు. అలాంటప్పుడు ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైతే, సూర్యుడు కనిపించడు. ఆ సమయంలో జ్ఞానజ్యోతులు అనే పెనుగాలులు వీచినట్లైతే, అజ్ఞానపు చీకట్లు తొలగిపోయి ఆత్మసాక్షాత్కారం జరుగుతుంది.

మాయకు ఎవరూ అతీతులు కారు. జ్ఞానజ్యోతుల చేత మాత్రమే మాయను ఛేదించాలి" అన్నాడు శ్రీమన్నారాయణుడు.

ఐదవ అధ్యాయము (మంత్రము)

శ్రీమన్నారాయణా ! భూలోకంలో మానవులకు ఇహము పరము రెండు కావాలి. అలాంటప్పుడు ఆ దేవిని ప్రసన్నం చేసుకోటానికి మంత్రం ఏదైనా ఉన్నదా ? ఉంటే దాని వివరాలు ఏమిటో చెప్పవలసినది" అన్నాడు ఈశ్వరుడు. చెప్పటం మొదలు పెట్టాడు శ్రీమన్నారాయణుడు.

ఆపరమేశ్వరి సృష్టిస్థితిలయాలకు కారణభూతమై త్రిమూర్తులను, త్రిశక్తులను సృష్టించినది. త్రిశక్తులు అంటే మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి. లోకంలోని మానవులకు శక్తినిచ్చేది కాళి, సంపదలనిచ్చేది లక్ష్మి, జ్ఞానాన్ని ప్రసాదించేది సరస్వతి. ఈ రకంగా ఈ ముగ్గురూ ఇహపరాలు ఇస్తుంటారు. త్రిమూర్తి స్వరూపమైనది, త్రిశక్తి స్వరూపమైనది. అయిన ఆ దేవియొక్క మంత్రంలో త్రిశక్తుల బీజాలే ఉంటాయి.

పరమేశ్వరిని జపించే మంత్రాలు మూడు. అవి 1. బాలామంత్రము 2. పంచదశి మహామంత్రము 3. షోడశి మహామంత్రము

1. బాలా మంత్రము : ఈ మంత్రంలో పరమేశ్వరిని బాలాత్రిపుర సుందరిగా జపిస్తారు. ఈమె తొమ్మిది సంవత్సరాలున్న కన్య. బాలా మంత్రంలో త్రిశక్తుల బీజాలుంటాయి. అవి. ఐం – వాగ్భవ బీజము, క్లీం – కామరాజ బీజము, సౌః – శక్తి బీజము. ఈ మూడు బీజములు ఇదే వరుసలో ఉంటాయి. అయితే అనులోమ విలోమంగా ఉంటాయి. అందుచేత ఈ మంత్రానికి శక్తి ఎక్కువ.

బాలామంత్రానికి దక్షిణామూర్తి ఋషి, పంక్తి ఛందస్సు, బాలాత్రిపుర సుందరి దేవత, ఐం బీజం, సౌః శక్తి, క్లీం కీలకం. న్యాసము : ఐం । క్లీం। సౌః । సౌః । క్లీం। ఐం. మంత్రము – **ఐం క్లీం సౌః సౌః క్లీం ఐం.**

పంచదశీ మహామంత్రము : ఇది పదిహేను అక్షరాలతో కూడి మూడు ఖండాలుగా ఉంటుంది. ఆ ఖండాలనే కూటములు అని కూడా అంటారు. అవి 1. వాగ్భవకూటమి, 2. కామరాజకూటమి 3. శక్తికూటమి

ఈ మంత్రంలోని వాగ్భవకూటమిలో నాలుగు, కామరాజ కూటమిలో ఐదు, శక్తికూటమిలో మూడు వెరసి పన్నెండు బీజాలుంటాయి. ప్రతి కూటమికి చివర హ్రీంకారముంటుంది. ఈ రకంగా మంత్రంలో మొత్తం పదిహేను బీజాక్షరాలుంటాయి.

భాషకు అక్షరాలు యాభై. అందులో అచ్చులు పదహారు. అచ్చులన్నీ శక్తి రూపాలు, హల్లులు శివరూపాలు. ఈ రకంగా ఉన్న అక్షరాలు మొత్తాన్ని మూడు భాగాలుగా చేసింది పరమేశ్వరి.

1. అ నుంచి అః వరకు మొదటి భాగము, 2. క నుంచి త వరకు రెండవ భాగము, 3. థ నుంచి స వరకు మూడవ భాగము

ఈ మూడు భాగాలలో సత్త్వరజస్తమో గుణాలు, త్రిమూర్తులు, త్రిశక్తులు, జాగ్రస్వప్న సుషుప్తులు, చంద్ర సూర్యాగ్ని దేవతల తత్త్వాలు చేర్చబడ్డాయి. అలాగే ఈ భాగాలలో మహాత్రిపురసుందరి, కామేశ్వరి, భగమాలిని, నిత్యక్లిన్నా, భేరుండా, వహ్నివాసిని, మహా వజ్రేశ్వరి శివదూతి, (రౌద్రి) త్వరిత, కులసుందరి, నిత్య, నీలపతాక, విజయ, సర్వమంగళ, జ్వాలామాలిని, చిత్ర మొదలయిన షోడశ నిత్యలను, చంద్రకళలను చేర్చటం జరిగింది. శివ, శక్తి, మాయ, శుద్ధ విద్య, జలము అనే ఐదు తత్త్వాలకు సంబంధించిన మొదటి ఖండాన్ని వాగ్భవకూటమి అంటారు. అదే అగ్నిఖండము. తేజస్సు, వాయువు, మనస్సు, పృథివి, ఆకాశము అనే ఐదు తత్త్వాలకు సంబంధించిన రెండవ ఖండాన్ని కామరాజకూటమి అంటారు. అదే సూర్యఖండము. విద్య, మహేశ్వరి, పర, ఆత్మ, సదాశివ

తత్త్వాలకు సంబంధించిన మూడవ ఖండాన్ని శక్తికూటమి అంటారు. అదే చంద్రఖండము. ఇక్కడ ప్రతిఖండానికి చివర హ్రీంకారము చెప్పబడింది. ఈ రకంగా పదిహేను అక్షరములు గలది ఈ మంత్రము. పంచదశి మహామంత్రానికి దక్షిణామూర్తి ఋషి, పంక్తి ఛందస్సు, లలితా త్రిపుర సుందరి దేవత, క ఏ ఈ ల హ్రీం । బీజం । హసకహల హ్రీం, శక్తి, సకల హ్రీం । కీలకము న్యాసము 1. క ఏ ఈ ల హ్రీం 2. హసకహల హ్రీం । 3. సకల హ్రీం. 4. క ఏ ఈ ల హ్రీం 5. హసక హల హ్రీం 6. సకల హ్రీం. మంత్రము–**క ఏ ఈ ల హ్రీం । హ స క హ ల హ్రీం । స క ల హ్రీం॥**

ఈ మంత్రాన్ని జపించేటప్పుడు మొదటి కూటమిని రెండవ కూటమి తోను, రెండవ కూటమిని మూడవ కూటమితోను కలిపి ఉచ్చరించాలి.

పంచదశి మహామంత్రాన్ని మొత్తం నాలుగు బీజాలుగా లెక్కపెట్టాలి. ఇందులో మూడు కూటములు, మూడు బీజాలు, మంత్రము మొత్తము కలిపి ఒక బీజము.

మొదటి కూటమి సృష్టి రూపము, రెండవ కూటమి స్థితిరూపము, మూడవ కూటమి సంహార రూపము, సమిష్టి కూటమి తిరోదాన అనుగ్రహ రూపము సృష్టి స్థితి సంహారాలు ఒక్కొక్కటి మూడు విధాలు. అది ప్రతికూటమిలోనూ మూడు రకాలుగా ఉంటుంది.

1. సృష్టి సృష్టి, సృష్టి స్థితి, సృష్టి సంహారము
2. స్థితి సృష్టి, స్థితి స్థితి, స్థితి సంహారము.
3. సంహారసృష్టి, సంహారస్థితి, సంహార సంహారము

వీటన్నింటికీ త్రిమూర్తులు (బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు), త్రిశక్తులు (భారతి, పృథివి, రుద్రాణి) అధిపతులు.

ఈ ఆరుగురూ పంచదశి మహామంత్రంలోని ఒక్కొక్క అక్షరానికి దేవతలై ఉన్నారు.

ప్రథమకూటమిలో :

కకారము	–	బ్రహ్మ
ఏకారము	–	భారతి
ఈకారము	–	విష్ణువు
లకారము	–	పృథివి
హ్రీంకారములోని హకారము	–	రుద్రుడు
రకారము	–	రుద్రాణి

రెండవ కూటమిలోని రెండవ హకారాన్ని మూడవ కూటమిలో మొదట చేర్చినట్లైతే రెండు మూడు కూటములు ఒకటే అవుతాయి. అప్పుడు.

హకారము	–	బ్రహ్మ
సకారము	–	భారతి
కకారము	–	విష్ణువు
లకారము	–	పృథివి
హ్రీంకారములోని హకారము	–	రుద్రుడు
రకారము	–	రుద్రాణి

ఈ రకంగా పంచదశి మహామంత్రానికి త్రిమూర్తులు, త్రిశక్తులే అధిదేవతలు. అంటే ఈ మంత్రానికి సృష్టి స్థితి లయకారిణి అయిన ఆ పరమేశ్వరియే అధిదేవత. పంచీకరణ జరిగినప్పుడు పంచభూతాలు పదిహేను భాగాలయినాయి. ఆ పదిహేను భాగాలే పంచదశి మహామంత్రం లోని పదిహేను బీజములు.

షోడశీ మహామంత్రము : పరమేశ్వరిని జపించే మంత్రాలలో షోడశి మహామంత్రము అతిముఖ్యమైనది. దీన్నే మహాషోడశి అని కూడా అంటారు. ఇది ఇరవై ఎనిమిది అక్షరాలు గల మంత్రం. ప్రణవము అంటే – ఓంకారము. ఇది పరమేశ్వర స్వరూపం. అలాగే పరమేశ్వరి స్వరూపమయిన ప్రణవాలు ఐదు ఉన్నాయి. శ్రీం హ్రీం క్లీం ఐం సౌః ఈ ఐదింటినీ శక్తి ప్రణవాలు అంటారు.

పంచదశి మహామంత్రానికి ముందు ఎనిమిది, తరువాత ఐదు బీజాలు చేర్చినట్లైతే అది మహాషోడశి అవుతుంది. ఈ శక్తి ప్రణవాలు పంచదశి మహామంత్రానికి ముందు అనులోమంగానూ, తరువాత విలోమంగాను చేర్చాలి. ఈ రకంగా చేసినట్లైతే పంచదశి మంత్రానికి ముందు ఎనిమిది, తరువాత ఐదు వెరసి పదమూడు బీజాలు, పంచదశి మంత్రంలోని మూడు ఖండాలను మూడు బీజాలుగా లెక్కించాలి. అప్పుడు మొత్తం పదహారు అక్షరాలవుతాయి. ఇదే మహాషోడశి. ఈ మంత్రానికి దక్షిణామూర్తి ఋషి, పంక్తి ఛందస్సు, మహాత్రిపుర సుందరీ రాజరాజేశ్వరి దేవతా, క ఏ ఈ ల హ్రీం బీజం। సకల హ్రీం శక్తిః। హసక హల హ్రీం కీలము. సౌభాగ్య విద్యా పంచదశి మూడు కూటములతోనూ రెండు ఆవృత్తులు న్యాసము ఉంటుంది. మంత్రము :

శ్రీం హ్రీం క్లీం ఐం సౌః ఓం హ్రీం శ్రీం క ఏ ఈ ల హ్రీం। హసకహల హ్రీం। సకల హ్రీం। సౌః ఐం క్లీం హ్రీం శ్రీం॥

పరమేశ్వరి మంత్రజపం చేస్తే ఇహము, పరము కూడా లభిస్తాయి. అన్నాడు శ్రీమన్నారాయణుడు.

ఆరవ అధ్యాయము (యంత్రము)

"దేవాధిదేవా ! శ్రీమన్నారాయణా ! పరమేశ్వరిని మంత్రం ద్వారా జపించాలి అన్నావు. మరి ఆమెను అర్చించటానికి యంత్రము ఏదీ లేదా? ఉంటే దాని స్వరూపం వివరించవలసినది" అని అడిగాడు ఇంద్రుడు. పరమేశ్వరికి ప్రతిరూపమైన యంత్రాన్ని (శ్రీచక్రాన్ని) వివరిస్తున్నాడు శ్రీమన్నారాయణుడు.

పరమేశ్వరికి ప్రతిరూపమైన యంత్రాన్నే 'శ్రీచక్రము' అంటారు. ఇందులో మొత్తం తొమ్మిది చక్రాలు ఉంటాయి. అవి వరుసగా బిందువు, త్రికోణము, అష్టకోణము, పదికోణాలు గల చక్రాలు రెండు, పద్నాలుగు కోణములు గల చక్రము, అష్టదళము, షోడశదళము, భూపురత్రయము.

పరమేశ్వరి అంటే స్త్రీ మూర్తి అనిగాని, పరమేశ్వరుడు అంటే పురుషుడు అనిగాని అర్థం కాదు. అది శివశక్తుల సమైక్యరూపము. పరమేశ్వరి ప్రతిరూపమే శ్రీచక్రము. అంటే ఇది శివశక్తుల సంగమస్థానము. ఇందులో శివచక్రాలు నాలుగు, శక్తి చక్రాలు ఐదు వెరసి తొమ్మిది చక్రాలున్నాయి. వీటిలో త్రికోణము, అష్టకోణము దశారద్వయము, చతుర్దశారము శక్తిచక్రాలు. కాగా బిందువు, అష్టదళము, షోడశదళము, భూపురము శివచక్రాలు. ఈ చక్రాలు అన్నీ విడివిడిగా ఉండవు. వీటికి అవినాభావ సంబంధమున్నది.

త్రికోణమందు	–	బిందువు
అష్టకోణమందు	–	అష్టదళపద్మము
దశారయుగ్మమందు	–	షోడశదళ పద్మము
చతుర్దశారమందు	–	భూపురము సంయోగము చెంది ఉంటాయి.

శ్రీచక్రంలో ఉండే తొమ్మిది చక్రాలనే విడివిడిగా తొమ్మిది ఆవరణలు అంటారు.

1. మొదటి ఆవరణ : దీన్నే భూపురము అంటారు. ఇందులో మూడు రేఖలు ఉంటాయి. దీని పేరు త్రైలోక్యమోహన చక్రము.

2. రెండవ ఆవరణ : ఇది షోడశదళ పద్మము. పదహారు దళాలుగల పద్మము. దీన్ని సర్వాశాపరిపూరక చక్రము అంటారు.

3. మూడవ ఆవరణ : అష్టదళ పద్మము ఎనిమిది దళాలు గల పద్మము. దీన్ని సర్వసంక్షోభణ చక్రము అంటారు.

4. నాల్గవ ఆవరణ : చతుర్దశారము. పద్నాలుగు కోణాలు గల పద్మము. దీన్ని సర్వసౌభాగ్యదాయక చక్రము అంటారు.

5. ఐదవ ఆవరణ : బహిర్దశారము. పదికోణాలు గల చక్రము. దీన్ని సర్వార్థ సాధక చక్రము అంటారు.

6. ఆరవ ఆవరణ : అంతర్దశారము. పదికోణాలు గల చక్రము. దీన్ని సర్వరక్షాకర చక్రము అంటారు.

7. ఏడవ ఆవరణ : అష్టకోణము. ఎనిమిది కోణాలు గల చక్రము. దీన్ని సర్వరోగహర చక్రము అంటారు.

8. ఎనిమిదవ ఆవరణ : త్రికోణము. మూడు కోణాలు గల చక్రము. దీన్ని సర్వసిద్ధిప్రద చక్రము అంటారు.

9. తొమ్మిదవ ఆవరణ : బిందువు. దీన్ని సర్వానందమయ చక్రము అంటారు.

శ్రీచక్రంలో మూడు వృత్తాలు కూడా ఉంటాయి. అవి భూపురానికి, షోడశదళానికీ మధ్యన ఉంటాయి.

శ్రీచక్రంలో పంచభూతాలు, తన్మాత్రలు, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనస్సు, మాయ, శుద్ధవిద్య, మహేశ్వరుడు, సదాశివుడు అనే ఇరవై ఐదు తత్త్వాలున్నాయి. ఇరవై ఆరవ తత్త్వమే సాదాఖ్యకళ. అదే పరమేశ్వరి. శ్రీచక్రము బ్రహ్మాండానికి ప్రతీక. చరాచర జగత్తుకూ ప్రతీక. జగత్తును సృష్టించటానికి కావలసిన పంచభూతాలు, తన్మాత్రలు ఇందులోనే ఉన్నాయి. అలాగే శ్రీచక్రము జగత్తునందు గల ఎనభై నాలుగు లక్షల జీవరాశికీ ప్రతీక. జీవులకు ఉండే జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు ఇందులో ఉన్నాయి. శ్రీచక్రము విశ్వమానవాళికి ప్రతీక. ఇతర జీవరాశికి లేనిది, మానవులకు మాత్రమే ఉన్నది అయిన ఆలోచించే శక్తిగల మనస్సు కూడా ఈ శ్రీచక్రంలోనే ఉన్నది. అందుచేతనే శ్రీచక్రము చరాచర జగత్తుకు ప్రతీక. జగత్తులోని జీవరాశికి ప్రతీక, విశ్వమానవాళికి ప్రతీక. కాబట్టి శ్రీచక్రాన్ని అర్చించినట్లైతే చరాచర జగత్తునూ అర్చించినట్లే. ఎనభైనాలుగు లక్షల రకాల జీవరాశిని అర్చించినట్లే. విశ్వమానవాళినంతటినీ అర్చించినట్లే

అంతేకాదు. శ్రీచక్రము అంటే సాక్షాత్తు మానవదేహమే. మానవ శరీరములోని

బ్రహ్మరంధ్రము	–	బిందువు
తలముందుభాగము	–	త్రికోణము
లలాటము	–	అష్టకోణము
భ్రూమధ్యము	–	అంతర్దశారము
కంఠము	–	బహిర్దశారము
హృదయము	–	చతుర్దశారము
నాభి	–	అష్టదళపద్మము
కటిప్రదేశము	–	షోడశదళ పద్మము

ఊరువులు	–	వృత్తత్రయము
పాదాలు	–	భూపురము

అంతేకాదు శ్రీచక్రానికి, మానవ దేహంలోని షట్చక్రాలకు కూడా ఐక్యత ఉన్నది.

1. ఆధారచక్రానికి – త్రికోణంతో ఐక్యత
2. స్వాధిష్ఠానానికి – అష్టకోణంతో ఐక్యత
3. మణిపూరానికి – అంతర్దశారంతో ఐక్యత
4. అనాహతానికి – బహిర్దశారంతో ఐక్యత
5. విశుద్ధి చక్రానికి – చతుర్దశారంతో ఐక్యత
6. ఆజ్ఞాచక్రానికి – అష్టదళము, షోడశదళము, భూపురములతో ఐక్యత
7. సహస్రారానికి – బిందువుతో ఐక్యత

ఈ రకంగా శ్రీచక్రము అంటే మానవదేహం తప్ప వేరు కాదు.

శ్రీచక్రంలో ఇరవై నాలుగు సంధులు, ఇరవై ఎనిమిది మర్మస్థానాలు ఉన్నాయి. రెండు రేఖలు కలిసే స్థానాన్ని 'సంధి' అంటారు. మూడు రేఖలు కలిసే స్థానాన్ని 'మర్మస్థానము' అంటారు.

శ్రీచక్రంలో మొత్తం నలభై ఐదు కోణాలుంటాయి. త్రికోణంలో మూడు, అష్టకోణంలో ఎనిమిది, అంతర్దశారంలో పది, బహిర్దశారంలో పది, చతుర్దశారంలో పద్నాలుగు వెరసి శ్రీచక్రంలోని కోణాలు నలభై ఐదు. అంతేకాక శ్రీచక్రం భూప్రస్తారము, మేరుప్రస్తారము, కైలాస ప్రస్తారము అని మూడు ప్రస్తారాలుగా ఉంటుంది.

శ్రీచక్రంలోని వివిధ ఆవరణలలోను వివిధ రకాలైన దేవతలుంటారు. ముందుగా

ప్రథమావరణ : ఇది భూతత్త్వాత్మకము. నాలుగువైపులా ద్వారాలు కలిగి, చతురస్రంగా ఉంటుంది. ఇందులో మూడు రేఖలు ఉంటాయి.

ప్రథమరేఖలో : అష్టసిద్ధులు, ద్వితీయ రేఖలో బ్రాహ్మి మొదలైన అష్టమాతృకలు, తృతీయ రేఖలో సర్వసంక్షోభిణి మొదలైన దేవతలుంటారు.

ద్వితీయావరణ : చంద్రకళా స్వరూపము ఇందులో చంద్రునియొక్క పదహారు కళలు ఉంటాయి. ఇందులో కామాకర్షిణి మొదలైన ఆకర్షణ దేవతలుంటారు.

తృతీయావరణ : అష్టమూర్త్యాత్మకము. ఇందులో అనంగకుసుమ మొదలైన దేవతలుంటారు.

చతుర్థావరణ : చతుర్దశ భువనాత్మకము. ఇందులో సర్వసంక్షోభిణి మొదలైన దేవతలుంటారు.

పంచమావరణ : దశావతారాత్మకము. ఇందులో సర్వసిద్ధిప్రద మొదలైన దేవతలుంటారు.

షష్ఠ్యావరణ : దశకళాత్మకము. ఇందులో సర్వజ్ఞ మొదలైన దేవతలుంటారు.

సప్తమావరణ : అష్టమూర్త్యాత్మకము. ఇందులో వశిన్యాది దేవతలుంటారు.

అష్టమావరణ : త్రిగుణాత్మకము. ఇందులో కామేశ్వరి, వజ్రేశ్వరి, భగమాలిని అనే దేవతలుంటారు.

నవమావరణ : బిందువు. పరబ్రహ్మ స్వరూపము ఇక్కడ శివశక్తులు ఉంటారు.

శ్రీచక్రానికి రెండు రకాలుగా అర్చన చెయ్యవచ్చు.

1. సృష్టిపూజ : బిందువు దగ్గర మొదలుపెట్టి భూపురందాకా తొమ్మిది ఆవరణలను అర్చించటం.

2. సంహారపూజ : భూపురం దగ్గర మొదలుపెట్టి బిందువుదాకా తొమ్మిది ఆవరణలను అర్చించటం. మేరు ప్రస్తారం మీద సృష్టిపూజ, కైలాసప్రస్తారం మీద సంహార పూజ చెయ్యాలి.

జగత్తు సృష్టి జరిగేటప్పుడు పంచభూతాలు పంచీకరణ చెంది పదిహేను భాగాలయినాయి. ఆ పదిహేను భాగాలే పంచదశి మహామంత్రం లోని పదిహేను బీజాక్షరాలు.

పంచదశి మహామంత్రంలో మొత్తం తొమ్మిది అక్షరాలే ఉన్నాయి. (ఒకసారి లెక్కించిన దానిని మళ్ళీ లెక్కపెట్టకూడదు) ఈ తొమ్మిది అక్షరాలవల్లనే తొమ్మిది ఆవరణలు గల శ్రీచక్రము ఏర్పడింది. అవి

1. లకారము : పృథివీ బీజము. దీనివల్ల భూపురము వచ్చింది.
2. సకారము : చంద్ర బీజము. దీనివల్ల షోడశదళము వచ్చింది.
3. హకారము : ఆకాశబీజము. దీనివల్ల అష్టదళము వచ్చింది.
4. ఏకారము : శక్తి బీజము. దీనివల్ల బహిర్దశారము వచ్చింది.
5. రకారము : అగ్ని బీజము. దీనివల్ల అంతర్దశారము వచ్చింది.
6. ఈకారము : మాయాబీజము. దీనివల్ల చతుర్దశారము వచ్చింది.
7. కకారము : మన్మథబీజము. దీనివల్ల అష్టకోణము వచ్చింది.
8. అర్ధచంద్రము : ఇదే నాదము. దీనివల్ల త్రికోణం వచ్చింది.
9. బిందువు : పరబ్రహ్మాత్మకము. దీనినుంచి శివశక్తుల స్వరూపమైన బిందువు వచ్చింది.

ఈ రకంగా పంచదశి మహామంత్రము నుంచే శ్రీచక్రము ఆవిర్భవించింది. అంటే ఆ పరమేశ్వరి యొక్క యంత్రము, మంత్రము రెండూ ఒక్కటే. ఆ తరువాత భక్తులకోసం ఆ దేవి నాలుగు భుజములతో ఒకరూపం ధరించి సాకార అయింది. అన్నాడు శ్రీమన్నారాయణుడు.

ఏడవ అధ్యాయము (ముక్తి)

"శ్రీమన్నారాయణా ! పరమేశ్వరి యొక్క మంత్రాన్ని వివరించావు. ఆమెకు ప్రతిరూపమైన యంత్రము, శ్రీచక్రాన్ని వివరించావు. ఆ పరమేశ్వరిని అర్చించి తరించాలంటే, మోక్షము సాధించాలంటే మార్గం ఏమిటో వివరించవలసింది" అన్నారు దేవతలంతా ముక్తకంఠంతో. ఆ మాటలు విన్న శ్రీమన్నారాయణుడు చెప్పటం మొదలుపెట్టాడు.

దేవతలారా ! పరమేశ్వరి అర్చనావిధానం రెండురకాలుగా ఉంటుంది. 1. బాహ్యపూజ 2. అంతఃపూజ. బాహ్యపూజ అంటే పరమేశ్వరి ప్రతిమను గాని, ఆమెకు ప్రతిరూపమైన యంత్రాన్నిగాని ఎదురుగా ఉంచుకుని, దేవత వేరు, నేను వేరు అనే భావంతో పూజించటం. ఇది లౌకికవాదులు చేస్తారు. ఇక రెండవది అంతఃపూజ. సాధకుడు తన శరీరాన్నే శ్రీచక్రంగా భావించి, తానే పరమేశ్వరి స్వరూపాన్ని అనే భావనతో అర్చన చేస్తాడు. ఇది ముక్తికి మార్గము. ఇది కేవలము జ్ఞానులకు మాత్రమే సాధ్యము.

సాధకుడు నేను, నాది అనే అహంకార మమకారాలను వదలి వెయ్యాలి. అరి షడ్వర్గాలను జయించాలి. అప్పుడు ఈ జగత్తంతా ఒకటిగానే కనిపిస్తుంది. అందులో తేడాలుండవు. తరతమ భేదాలుండవు. అటువంటి స్థితిలో ఈ సృష్టి అంతా నావల్లనే జరుగుతోంది. సృష్టిస్థితి లయ కారకుడను

నేనే. ఈ జగత్తు అంతా నాలోనే ఇమిడి ఉన్నది. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలు అన్నీ నానుంచే ఆవిర్భవిస్తున్నాయి. నేనే పరబ్రహ్మ స్వరూపాన్ని అని త్రికరణశుద్ధిగా భావిస్తాడు. అటువంటివాడే జ్ఞాని.

అమృతపానం చేసేవాడికి పాలతో ప్రయోజనం ఉండదు. అలాగే జ్ఞానమనే అమృతాన్ని సంపాదించిన వాడికి కర్తవ్యము ఏదీ ఉండదు ఆత్మ జ్ఞాని, తత్త్వవేత్త, అనబడతాడు. అతడు అంతటా వ్యాపించ గలుగుతాడు. అతడు శరీరము ధరించి ఉన్నప్పటికీ, శరీరము లేనివాడిగానే లెక్క. అతడు సర్వసన్యాసి. సర్వ సంఘ పరిత్యాగి. వంటి మీద బట్టలు కట్టుకోడు, స్నానం చెయ్యడు. తిండి తినడు, నీరు త్రాగడు. ఒకచోట స్థిరంగా ఉండడు. పిచ్చివాడిలాగా దేశాల వెంట తిరుగుతుంటాడు. ఎవరితోనూ మాట్లాడడు. ఒంటరి జీవనం చేస్తుంటాడు. ఎక్కువగా అరణ్యాలలోను, ఒంటరి ప్రదేశాలలోనూ సంచరిస్తూ నిరంతరము ఆత్మధ్యానం చేస్తుంటాడు. అతడికి సంకల్ప వికల్పాలుండవు. అతడు సర్వశాస్త్ర పండితుడు. కాని ఏమీ తెలియనివాడు. శిష్టాచారుడు. కాని ఏ ఆచారము పాటించడు. కర్మలు చెయ్యటంలో నిష్ణాతుడు. కాని ఏ కర్మలు చెయ్యడు. భూత భవిష్యద్వర్తమానాలు పూర్తిగా తెలిసినవాడు. కాని ఏమీ తెలియనివాడు. తనలో తాను మాట్లాడుకుంటూ ఉంటాడు. ఆత్మసాక్షాత్కారము పొందినవాడు. జీవన్ముక్తుడు. ఈ శరీరాన్ని వదలి గాలిలోగాలిలాగా, నీటిలో నీరులాగా, కాంతిలో కాంతిలాగా పరమాత్మలో లీనమవటానికి సిద్ధంగా ఉన్నవాడు. పండిపోయి రాలిపోవటానికి సిద్ధంగా ఉన్నవాడు. విదేహముక్తి లభించగానే అంటే దేహాన్ని విడిచిపెట్టగానే పరమాత్మలో లీనమవుతాడు. అదే మోక్షము, అదే సాయుజ్యము, అదే కైవల్యము. అదే ముక్తి. జీవాత్మ పరమాత్మల ఏకీభావము.

దేవతలారా ! ముక్తి అంటే విముక్తి. అదే ఐహిక బంధనాల నుండి విముక్తి పొందటం. మానవుడికి ఉన్న శత్రువులలో ముఖ్యమైనవి రాగద్వేషాలు. రాగము అంటే అనురాగము. ఏదైనా ఒకవస్తువు పట్ల లేదా ఒక వ్యక్తిపట్ల ఉండే అపేక్ష. బలమైన కోరిక. ఆ కోరిక తీరకపోతే, ద్వేషం పెరుగుతుంది. రాగము అనేది జీవిని బంధించి వేస్తుంది. ద్వేషము ఇంకొకరిని బాధిస్తుంది. ఇవి ఉన్నంతవరకు మానవుడు దేన్నీ సాధించలేడు. అసత్యాన్ని సత్యమనుకుని భ్రమపడుతుంటాడు. అందుచేత ముందుగా రాగద్వేషాలను జయించాలి. మనసును పూర్తిగా అదుపులో ఉంచుకోవాలి. మనస్సే సంకల్ప వికల్పాలకు కారణం. కాబట్టి మనసును జయించాలి. మనసును నశింపచెయ్యాలి. అమనస్కయోగము సాధించాలి. అమనస్కయోగము సాధించినవాడే మహాజ్ఞాని. సాక్షాత్తు పరమేశ్వరుడు. ఈ ఉపనిషత్తును విన్నంత మాత్రంచేతనే జన్మజన్మల పాపము నశించి పరమేశ్వరి అనుగ్రహం కలుగుతుంది. అంటూ **"లలితా రహస్యోపనిషత్తు"** ను పూర్తి చేశాడు శ్రీమన్నారాయణుడు.

శ్రీ క్రోవి పురుషోత్తమశర్మ, శ్రీమతి లక్ష్మీనరసమ్మగార్ల పౌత్రుడు
శ్రీ క్రోవి కృష్ణమూర్తి, శ్రీమతి సత్యపర్వత వర్ధనమ్మగార్ల జ్యేష్ఠపుత్రుడు
*హరితస గోత్రికుడు **'పరమానంద నాథ'** దీక్షా నామధేయుడు అయిన*
***క్రోవి పార్థసారథి** సర్వజనామోదము పొందునట్లుగా వ్రాసిన*
*తన స్వప్నదృశ్యమైన **'లలితారహస్యోపనిషత్తు'** సమాప్తము*
ఓం తత్సత్